# పుస్తకం విడుదలైంది


ఇల్లు కట్టి చూడు - పెళ్ళి చేసి చూడు...." అనే సామెత ఔట్‌డేటెడ్ అయిపోయిందిప్పుడు. డబ్బులుంటే చాలు. పూచికపుల్ల ముట్టుకోనవసరం లేకుండా పనులైపోతున్నాయి. గృహప్రవేశానికి ఇంట్లో కెళ్ళొచ్చు, పెళ్ళిపందిట్లోకి అతిథుల్లా హాజరవ్వొచ్చు వియ్యంకులు సైతం కాని, ఒక సాహిత్య కార్యక్రమానికి జనాన్ని సమీకరించడం ఈనాడు అత్యంత కష్ట తరమైన కార్యం - అందులోనూ హైదరాబాద్ లాంటి నగరంలో... అదీ ఓ పుస్తకం విడుదలకు. అందుకే ఓ విజ్ఞుడన్నాడు ... " ఈ కాలంలో జనం డబ్బులివ్వడానికైనా సిద్ధంగా ఉన్నారుగానీ ఒక మంచి కార్యక్రమం కోసం సమయమివ్వడానికి సుముఖంగా లేరు".

కరెక్టే ' మందు' కోసం', 'విందు' కోసం ముందే ఉంటారు. కనువిందైన సినిమా కోసం ఒకప్పుడు గంటల తరబడి సమయం, ధనం ఖర్చుపెట్టేవారు. కాని, ఓ కవి సమ్మేళనానికో, సాహితీ చర్చకో, పుస్తకం విడుదలకో సకాలానికొచ్చి, కార్యక్రమాంతం దాకి ఉండేదెందరు ?

ఎంతో శ్రమకోర్చి ఓ కవితా సంపుటి అచ్చేయించాడు రాజు. పేరున్న సంస్థతో విడుదలకు ఏర్పాట్లు చేయించుకున్నాడు. ఐదువందల ఆహ్వానాలు కొట్టించి, యాభైకి పైగా పోస్టులో వేశాడు, వందకు పైగా ఫోన్‌కాల్స్ చేశాడు, పత్రికల వారికిచ్చి, సిటీ డైరీల్లో పడేట్టు చూశాడు. స్నేహితులకు, తెలిసిన వాళ్లకూ ఇచ్చి వాళ్లతో పాటు ఇంకొందరినీ పిలవ-మని అదనంగా ఆహ్వానాలిచ్చాడు. అందరూ 'ఆహ్వానితులే ' అంటూ పెద్దక్షరాల్లో వేశాడు, బ్యానర్లు కట్టించాడు, ప్రత్యేక ఆకర్షణగా కార్యక్రమానికి ముందు సినీ సంగీత విభావరి పెట్టించాడు. వచ్చిన వాళ్లందరి కోసం ఫ్రెష్‌గా రిఫ్రెష్‌మెంట్స్ ఏర్పాటు చేశాడు.

కార్యక్రమం ప్రారంభంలో ఓ మోస్తరు సంఖ్య కనిపించింది. రిఫ్రెష్‌మెంట్స్ పూర్తవ్వగానే కొందరు తగ్గారు. సంగీత విభావరి కాగానే సగం తగ్గారు. అసలు కార్యక్రమం ఆరంభానికి నాలుగోవంతు మిగిలారు. చివరికి లెక్కపెడితే ఇరవైమంది మాత్రం ఉన్నారు. అందులో పదిమంది ఆ హాలుకి రెగ్యులర్ ప్రేక్షకులు. మిగతా పదిమందీ వేదిక మీదున్న అతిథులు వెంట తెచ్చుకున్నవాళ్ళు.

రాజుకి ఐనవాళ్లనుకున్న వాళ్ళందరిమీదా పీకలదాకా కోపమొచ్చింది. అందరూ మెరమెచ్చుగాళ్లేగాని, తనంటే నిజంగా ఎవరికీ అభిమానం లేదనే - నిజం నిర్ధారణ జరిగిపోయింది.




స్నేహితులు, బంధువులు అనే బంధాలు కేవలం కల్పితాలు, అశాశ్వతాలు' అనే వైరాగ్యం ధ్రువపడిపోయింది. అసలు ఎవ్వరినీ తలుచుకొనే కూడదనే నిర్ణయం బలపడిపోయింది.

డోర్ బెల్ మోగింది. మెలకువ వచ్చినా, లేవడానికి మనసొప్పక, నిన్నటి కార్యక్రమం తాలూకు అనుభవాలతో సతమత మవుతున్న రాజు నెమ్మదిగా లేచాడు - 'ఇంకెవ్వడు ? ఆ కుమార్ గాడే వచ్చుంటాడు. నిన్నంతా ఎక్కడ మాయమయ్యాడో.... దులిపెయ్యాలి, వెధవని ....' కసిగా అనుకుంటూ డోర్ తెరిచాడు. ఎదురుగా చెత్త మనిషి, (ఇలా అనడం బాగుండదు. చెత్తకోసం వచ్చే మనిషి, పోనీ చె.మ. అందాం గౌరవంగా) రాజు కనబడగానే ఒంటిచేత్తో దణ్ణం పెట్టాడు పలకరింపుగా. అది తనమీద గౌరవంతో కాదని, అతనికేదో ముట్టజెప్పాలనీ అర్థమైంది రాజుకి. 'పొద్దున్నే వీణ్ణి చూశానేంటి ?'' అని మొహం చిట్లించు కుంటూ, లోపలికెళ్లి ఓ పది రూపాయలనోటు తెచ్చి అతనికిచ్చాడు.

'హు ! ఇంతేనా ?'' అన్ననట్టు ఓ ఎక్స్‌ప్రెషనిచ్చి, యధాలాపంగా ఆ నోటుని నిక్కరు జేబులో వేసుకున్నాడు. కానీ అక్కడ్నుంచి కదల్లేదు.

అతనెందుకు నిలుచున్నాడో రాజుకి అర్థం కాలేదు - రాజుకి.. 'ఇంకా ఏం కావాలి ?' అని అడిగేందుకు ధైర్యం చాలలేదు. మొహమ్మీద తలుపేయడానికి సంస్కారం ఒప్పుకోలేదు.

కొన్ని క్షణాలు నిర్లిప్తంగా గడిచిపోయాయి. సరే వీడితో మన కెందుకని ' అనుకుంటూ డోర్ వేసుకోబోయాడు.

"సార్ ! ఒగ పుస్తకం.... " అర్థోక్తిగా ఆగిపోయాడు చె.మ.

"పుస్తకమా ? ఏం పుస్తకం ?" రాజు అయోమయం.

"అదే, మీరు రాసిన్రంట గద .... ?" నసిగాడు చె.మ.

"నీకెవరు చెప్పారు ? ఏం చేసుకుంటావు ? వగైరా ప్రశ్నలతో ప్రయోజనం ఉండదని, పైగా 'ముఖే ముఖే సరస్వతి ' అనే ఆర్యోక్తి పట్ల నమ్మకం ఉంది గాబట్టి. 'అడగని వాళ్లకెందరికో ఇచ్చాం, అడిగిన వాళ్ళకివ్వడంలో తప్పులేదు' అనే సమర్థన కుదిరి, తను నిన్న విడుదల చేసిన 'నీళ్ళోదులు ' కవితా సంకలనం కాపీని తెచ్చిచ్చాడు.

చె.మ. దాన్ని జాగ్రత్తగ ఓ ప్రత్యేకమైన పోలితిన్ కవర్లో వేసుకొని, భద్రంగా పట్టుకొని వెళ్ళబోయాడు.

"నువ్వేం చదూకున్నావ్ ?" ఆసక్తిగా అడిగాడు రాజు.

"నేను సదూకోలేదు సారూ !" చెమ నిజాయితీ.

"మరెందుకయ్యా పుస్తకం ?" రాజు ఆశ్చర్యం.

"నా బిడ్డ కోసం" చెమ జవాబు.

అమ్మాయి అనే సరికి హుషారొచ్చింది రాజుకి. అయినా వీడికి అంత పెద్ద కూతురుందా? అనే అనుమానం పీకుతుండగా అడిగాడు - " ఏం చదూతూంది ?"

"అన్నీ సదూతది సార్. - ఒకింత గర్వం చెమగొంతులో.

చిర్రెత్తుకొచ్చింది రాజుకి. ఒకింత నిగ్రహం పాటిస్తూ, కొంచెం తెలివిగా మరో ప్రశ్న వేశాడు " ఏ కాలేజీ కెళ్తుంది ?"

"కాలేజీ గాద్సార్, ఎల్కేజి " అంటూనే తాపీగా కదిలాడు చెమ.

హాశ్చర్యంలో నుండి తేరుకునేందుకు సమయం పట్టింది. ఓ నిట్టూర్పు విడుస్తూ, తలుపేసి మళ్లీ మంచంమీద పడ్డాడు రాజు.

"ఏంటీ మళ్ళీ పడుకుంటున్నావ్ ? ఈ రోజు ఆదివారం - మరచి పోయావా ? కాఫీ పూర్తయ్యాక నన్నులేపు " దాదాపు అరచినట్టు - చాలా అందంగా మందలించింది అర్ధాంగి. ఆమె పేరు కౌస్తుభ. ' కౌసు' గా అమె అందరికీ పరిచయం.

'ఛ బతుక్కొక అర్థం ఉండాలి.' అనుకుంటూ ఆరోజు చేయాల్సిన పనుల్ని తలచుకుంటూ వంటింటి వైపు అడుగులేశాడు రాజు.

ఇద్దరూ ఉద్యోగస్థులైనందున వారంలో ఒక్కరోజు మాత్రం తాను పనిచేయాలని తొలిరేయి కౌసు షరతు విధించినప్పుడు ఆనందంగా ఒప్పుకున్నాడు. "ఆధునిక జీవితంలో ఇలాంటివి మామూలేనన్న సర్దుబాటు ధోరణిలో. కాని, ఉద్యోగస్థులకు ఆదివారం చాలా విలువైందని, ఆరోజు పనిమనిషి కూడా రాదని .... అసలు సంపాదించే భార్యవల్ల ఆదాయం తప్ప గౌరవం ఉండ దని, ఆత్మ గౌరవానికీ చిల్లులు పడ్తాయని అప్పట్లో ఊహించకపోవడం...

ఏం చేస్తున్నా నిన్నటి తన పుస్తకం విడుదల కార్యక్రమానికి తనవాళ్ళనుకున్న వాళ్ళెవరూ రాక పోవడం అతను జీర్ణించుకోలేక పోతున్నాడు. ఉదయం కనీసం ముగ్గురు నలుగురు ఇంటికొచ్చి సంజాయిషీ చెబుతారనుకున్నాడు. కనీసం ఫోను కూడా చేయలేదెవ్వరూ. చివరికి తనే ఆ పనికి పూనుకున్నాడు కసిగా, బాధగా.

'అబ్బా ! నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నా గురూ ! నీకు నూరేళ్ళు.... " కొలీగ్ వెంకటేశ్వర్లు. ఎదుటివాడి అంతరంగాన్ని అంచనా వేయడంలో ఘటికుడిగా ప్రసిద్ధి. లైన్లో రాజు ఉన్నాడని గ్రహింపుకి రాగానే అలా మొదలుపెట్టాడు.

" నిన్న కార్యక్రమానికి రాలేదేంటి ?" సూటిగా ప్రశ్నించాడు రాజు.

"అది చెబుదామనే ఫోన్ చేద్దామనుకుంటున్నా...."

"ఏంటో ?! అన్నట్లు మౌనం వహించాడు రాజు.

పరిస్థితిలోని సీరియస్‌ని అర్థం చేసుకొని సర్దుకుపోసాగాడు వెంకటేశ్వర్లు. ఫారిన్ నుండి వాళ్ళ రిలేటివ్ ఒహడొచ్చాడని, నిన్ననే ఆ సంగతి తెలిసిందని, వాణ్ణి పట్టుకునేందుకు, బుట్టలో పెట్టుకునేందుకు, ఆపై తన విదేశీయానం పట్టు సాధించేందుకు ఎంతగా ప్రయత్నించింది. ఏమేం చేయబోతున్నదీ కళాత్మంగా వివరిస్తున్నాడు.

"ఎవిరిదా సుత్తి ? ఫోన్ చేసింది నువ్వేగా ! ఇంకెంత సేపు.....? పెట్టిసెయ్...." అంటూ అతనికి మాత్రమే వినబడేటట్టు కసురుకుంటూనే ఉంది కౌసు.

చివరికెలాగో ఆ దాడి తప్పించుకొని, ఫోన్ క్రెడిల్ చేశాడు.

'నీకసలు బుద్ధుందా ? ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడ్తారా ? మీ పైత్యమంతా దించుకునేందుకు ఫోన్లే దొరికాయా ? వేలకు వేలొస్తుంది బిల్లు.... ! " గ–<య్‌మంది కౌసు.

మూలుగుతున్న నక్కమీద తాటికాయ పడ్డట్టు అసలే వెంకటేశ్వర్లు దిక్కుమాలిన కథతో దిమ్మతిరిగిపోయిన రాజు, అర్ధాంగి కేకల్తో బిక్కసచ్చిపోయాడు. ఇంక ఇంట్లో ఉండలేకపోయాడు. 'ఇంటికంటె పార్కు పదిలం' అనుకుంటూ, అదే సంగతి హోం మినిస్టర్ కౌసుకి నివేదించి బయటపడ్డాడు. "అక్కడే అర్థరాతిరి దాకా కలలు గంటూ కూచోక తొందరగా వచ్చేసేయ్" అంటూ హెచ్చరికలు జారీచేసింది కౌసు - అతను బయటపడే వేళ.

పార్కులోకి అడుగు పెడ్తూనే - అనుకోకుండా గాంధీ విగ్రహం పక్కన చూశాడు. అక్కడో జంట హాయిగా కబుర్లు చెప్పుకుంటూంది. నమ్మలేనట్టు ఆ జంటని మరోసారి కళ్లు చికిలించి చూశాడు. సందేహం లేదు - వాడు మాత్రం రాజశేఖరే. వాడు అబద్ధాలకోరని తెలుసు కాని, ఇంత దగా చేస్తాడనుకోలేదు. పుస్తకం విడుదలకు రమ్మని ఆహ్వానిస్తే - ' అబ్బా ఈ ఆదివారం వరకూ నాక్కుదరదు గురూ ! ఆదివారం రోజే బందరులో మా దగ్గరి బంధువు కర్మొగటేడిసింది. రెండ్రోజులు ముందే రమ్మన్నారు. శనివారం మధ్యాహ్నం నుండే పర్మిషన్ తీసుకొని వెళ్తున్నానంటూ కథ చెప్పాడు. ఇప్పుడు ఎవరో అమ్మాయిని పక్కనేసుకొని..."

అసలు మనుషులెందుకిట్లా తయారయ్యారు ? 'వీడ్నిరోజు వదలకూడదు' కసిగా పళ్ళు నూరుతూ అటువైపు అడుగులేశాడు. అసలే ఉదయం నుండీ జరుగుతున్న సంఘటనల్తో కోపం, కసి, బాధా అతనిలో బాగా పెరిగిపోతున్నాయి.

"హలో .... ! సారా గారూ !" రపీమనీ ఎదురుపడ్డాడో శాల్తీ హఠాత్తుగా.

'ఎవరితను ?" చిరాగ్గా చూశాడు రాజు. మనిషి సినిమాల్లో గొల్లపూడిని తలపించేలా ఉన్నాడు. పైజామా - లాల్చీ, పైనుండి ఓ మడిచిన శాలువా - ఎడమ భుజమ్మీద, కళ్ళకు అద్దాలు, జుట్టుకు రంగు షరా మామూలు అతడి నుంచి తప్పించుకోలేక, ఎదిరించే సాహసం చేయలేక, రిసీవ్ చేసుకునేందుకు మనస్కరించక ఉన్న పళంగా ఉండిపోయాడు.

"కన్ఫ్యూజ్ అయ్యారు కదూ ! మీ పేరు కె. సామంతరాజు, బయటికి రాజు, ఆఫీసులో కె.ఎస్. రాజు మీ నాన్నపేరు అశ్వపతి, మీ అన్నపేరు సేనాధిపతి..."

అలా తన గురించి అంతా చెబుతున్న ఆ వింత శాల్తీకేసి అన్నీ మరచి చూడసాగాడు రాజు. ఎవరో ....? ఎక్కడ చూసినట్టుందే ..... ! అనుకుంటూ తనలో తాను కొట్టుకుంటున్నాడు. అతను మాత్రం తన వాక్ప్రవాహం ఆపలేదు.

"మీ గురించి ఇవన్నీ ఎలా తెలిశాయని ఆశ్చర్యపోకండి. మీ పుస్తకం విడుదల సందర్భంగా నేనక్కడికి రావడం మీకు సంబంధించిన ఎన్నో విషయాలను తెలుసుకోవడం జరిగిపోయాయి. అప్పుడు మీతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం దొరకలేదు. ఇప్పుడు దొరికింది. దొరికిన అవకాశం వదులుకో కూడదు కదండీ !"

రెప్పార్పకుండా చూస్తున్నాడు రాజు. .

"నిజానికి మీపేరు సామంతరాజు కాదు. కవిరాజు. నిన్ననే అద్భుతమైన 'నీళ్ళొదులు' నొదిలారు. మిమ్మల్ని మహామహుల జాబితాలో చేర్చాలనే అందంగా... అలా సా...రా... అన్నాను" ఊపిరి పీల్చుకునేందుకన్నట్టు ఆగాడు.

తనకు అంతటి గుర్తింపు లభించడం ఎంతో సంతోషాన్నించింది రాజుకి. - "రండి ! అలా కూర్చొని మాట్లాడుకుందాం !" ఖాళీగా ఉన్న కొబ్బరిచెట్టు మూలం వద్దకు దారితీస్తూ - "క్షమించాలి... మీపేరు ?" కూర్చోవడాని కుపక్రమిస్తూ అడిగాడు.

"మీరు క్షమించమని అడిగేంత నేరమేమీ చేయలేదు...." చేతిలోని సిగరెట్ బూడిద నేలరాలేలా చిటికేసి రాజు మొహంలోకి చూశాడు చిర్నవ్వుతో.

రాజు మొహం ప్రశ్నార్థకమయ్యింది.

"అదే మిస్టర్ సారా ! అయితే ఇంగ్లీషులో మాట్లాడాలి. లేదా తెలుగులో మాట్లాడాలి. తప్పని సరైనప్పుడు తెంగ్లీషులో.... అంటే సగం తెలుగు, సగం ఇంగ్లీషు కలిపి మాట్లాడాలి. కాని, పరభాషల్ని యథాతథంగా అనువదిస్తూ - అయిందానికి, కాని దానికీ ఇలా క్షమించమని అడగటం, మీ మంచి పేరేమిటి ? పైకి పో .... అంటూ ..... "

నవ్వాగలేదు రాజుకి. "బాగుంది !" అన్నాడు. ఆ రోజులో అది హృదయపూర్వకంగా నవ్విన తొలి నవ్వు

'మీ కవిత్వం ఇంకా బాగుంది. "ఠక్కున ఎకోసౌండ్ లెవల్లో సమాధానమిచ్చి " నాపేరు పాపం!" అనేశాడు ఠక్కున. నవ్వుకు ఆశ్చర్యం అడ్డంకిగా మారగా ఏదో అనబోయాడు రాజు.

"పాపం ! అని నామీద జాలి పడొద్దు. పేరు లోని పాపం చూసి అసహ్యించుకోవద్దు. అసలు పేరు పాశర్లపూడి పండరి. మీ అంత బాగా కవిత్వమైతే రాయలేను గానీ, కమ్మని కబుర్లు చెప్పగలను. వయసులో మీకంటే పెద్దవాడ్నే, రచనలో పసివాడ్ని మీరు కవితలు రాస్తారు. నేను మీలాంటి కవుల గురించీ, పుస్తకాల గురించిన మంచీ - చెడూ గురించి రాస్తాను.

వార్తాపత్రికలు చూస్తుంటే అడపాదడపా నేను కనిపిస్తాను ’ ‘చూశారా ?’ అన్నట్లు రాజు మొహంలోకి చూశాడు.

‘అయ్యో ! చూడలేకపోయాను !’ అన్నట్లు మొహం పెట్టాడు రాజు.

“మీరు చూడలేకపోవడం నేరంకాదు, ఘోరంకాదు. అసలు నా పేరును చూస్తేనే మ్యాటర్ చూడకుండా దాటేయాలనుకునే ఛాందసులూ ఉంటారు .... ”

ఆ గళం అనర్గళం. ఆ ప్రవాహంలో పడి కొట్టుకొని పోకుండా ఉండటం రాజుకి తరం కాలేదు. సడెన్‌గా వాచీ చూసుకున్నాడు. గుండెల్లో బ్లో అవుట్ !

“సారీ సర్ ! ఇక వెళ్దాం. నాకు చాలా పనుంది... ” దాదాపు లేస్తూ - రాజు.

“మీకేం పనుందో నాకు తెలుసు. ఇంకా ఆలస్యమైతే మీ ఆవిడ చమ్డాలూడదీస్తుంది. అవునా ?” నవ్వాడు పాపం.

ఉలిక్కి పడ్డాడు రాజు.

“నాకెలా తెలుసంటూ ఉలిక్కిపడనవసరం లేదు. చాలామంది ఉద్యోగస్థులకూ, కవులకూ ఉండే కామన్ బాధలివి. అందుకే ఆరుద్ర సైతం - ‘నా బాధే నా ప్రేయసీ ! అది స్వర్గాదపి గరీయసీ !!’ అన్నాడు తెలుసా ?” అన్నాడు.

‘ఆయనలా అన్నది నిజమే, కాని సందర్భం మాత్రం ఇది గాకపోవచ్చు. ఎందుకొచ్చిన గొడవ ? ఇప్పుడింటికెళ్ళడాన్ని మించిన మార్గాంతరం లేదు....” అనుకుంటూనే లేచాడు.

“ఒ.కే. ఫ్రెండ్ ! గుడ్‌నైట్ ! విసిగిస్తే క్షమించండి ... ” తనూ లేచి రాజుననుసరించాడు పాపం

“ఇంతకూ పుస్తకాలు ఎన్ని అమ్మారు ?” అడిగాడు కాజువల్ గా.

బిక్కమొగమేశాడు రాజు.

“పోనీ, ఎంత ఖర్చు పెట్టారు ?.... ముద్రణ నుండి విడుదల దాకా !” అడిగాడు పాపం.

రాజుకి అతను శ్రేయోభిలాషి అయిపోయాడు. మనసులోనే లెక్కలు గట్టుకొని చెప్పాడు

“ముప్పైవేల దాకా .... ”

“మరదే. ఇంట్లో ఆడాళ్ళకు మనపట్ల గౌరవంపోవడానికిది చాలదా ? దమ్మిడీ ఆదాయం లేదుగానీ, కష్టపడుతూ కష్టపడుతూ వేలకు వేలు నష్టం కలిగిస్తుంటే వాళ్ళూరుకుంటారా చెప్పండి!

ఆమె మీకు ఆస్తి అయినట్లే ఆమెకు మీరు సొంత ఆస్తి. మీ సంపదనంతా ఆమెకోసం ఖర్చు గావాలి గానీ మీరు ఖర్చయి, మీ సంపాదనంతా ఇలా కాగితాలపాలు చేస్తుంటే ఎలా ఊరుకుంటారు ?'' పాపం గొంతులో కాఠిన్యత.

అతని ఆలోచన, విజ్ఞత చూసి అపారమైన గౌరవం కల్గింది సారాకి. ఆ తర్వాత ఓ పావుగంట సేపు పుస్తకం నుండి రాబడి, కీర్తి ఎలా పెంచుకోవాలో చెప్పాడు పాపం. పత్రికల్లో విడుదల సమాచారం, సమీక్షలు, లైబ్రరీల్లో అమ్ముకోవడాలు, పబ్లిషర్లతో వ్యవహారాలు, అభినందన సంఘాల పరిచయాలు ...

"ఇంతకూ పుస్తకాలు ఎవరిఎవరికిచ్చారు ?'' అడిగాడు పాపం.

వంద దాకా ఇచ్చిన వివరాలు చెప్పారు సారా. చె.మ.తో సహా. "దయచేసి ఎవరికిపడతే వాళ్ళకి పుస్తకాలివ్వకండి. తప్పనిసరై ఇచ్చినా కాప్షన్ రాయకుండా ఇవ్వండి. ఓసారి ఆరుద్రగారి విషయంలో ఏం జరిగిందో తెలుసా ? ఆయనే స్వయంగా ఫుట్‌పాత్‌మీద తన పుస్తకం చూసి, కొన్నారట. లోపలి పేజీలో ఓ అభిమానికి 'ఆశీస్సులతో' అని వ్రాసి సంతకం పెట్టి ఉందట. వెంటనే వారు దాన్ని కొని పునః ఆశీస్సులతో' అని మళ్లీ వ్రాసి, సంతకం పెట్టి, తేదీ వేసి పంపించారట....''

నవ్వు రాలేదు రాజుకి. బాధతో పేగులు మెలిపెట్టినట్లైంది. పాపం గారితో ఉంటే, అతని మాటలు వింటూంటే సమయం మీద స్పృహే ఉండట్లేదు. హఠాత్తుగా మళ్లీ వాచీ చూసుకున్నాడు. పదయ్యింది. మరు నిమిషం ఇంట్లో పడ్డాడు.

కొసుకి ఓ మంచి గుణముంది. భోజనం చేసేటప్పుడు బాధ కల్గించే మాటలేవీ మాట్లాడదు. తిన్న తర్వాత అతనూహించినట్లే మాంఛి క్లాసు పీకింది. ఐనా పూర్వసంసిద్ధత. పాపంతో తెలుసుకున్న విషయాలవల్ల ఎప్పటిలా బాధ కల్గలేదు. పైగా 'కొసు అలా అరవడంలో తప్పులేదని సరిపెట్టుకున్నాడు.

రకరకాల ఆలోచనలతో ఆరాత్రి చాలా పొద్దుపోయేదాకా నిద్రపట్టలేదు రాజుకి

0-0-0

పాపంగారి, పుణ్యామా అని, అతని సలహాలు తు.చ. తప్పకుండా పాటించడం వల్ల సారా గొప్ప పేరు సంపాదించాడు అతికొద్దికాలంలోనే. పత్రికలు అతడ్ని ఆకాశానికెత్తేశాయి.

టీ.వీ. ఛానళ్ళలో ఇ.టర్వ్యూలు ఏర్పాటయ్యాయి. ఇంట్లో గౌరవం పెరిగిపోయింది. కాసు ఏపనీ చెప్పడం లేదు. ఎప్పుడైనా ఆమెకు కోపం వచ్చినా బహువచన సంబోధనలోనే మెత్తగా మందలిస్తున్నది. అభిమానులూ, దురభిమానులూ అయ్యారు. అభినందనలూ జరిగాయి. అలాంటి ఓ అభినందన సభలో ప్రముఖ సినీ నిర్మాత నాయుడు గారు కలిశారు.

రెండ్రోజుల తర్వాత ఆయనే స్వయంగా ఫోన్ చేసి "ఒకసారి మీ "నీళ్ళొదులు' పట్టుకు రండి. సినిమా అవకాశం కల్పిస్తానని చెప్పారు.

సారా ఆనందానికి అవధుల్లేవు. ఇంట్లో పుస్తకం కోసం వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. కంగారు పడిపోయాడు. బంగారం లాంటి అవకాశం.... వదులుకుంటే ఎలా ? తను కాంప్లిమెంటరీ కాపీలకింద ఇచ్చినవాళ్ళను వాకబు చేశాడు-

వెంకటేశ్వర్లుకి తెలియకుండా వాళ్ళావిడ పాత పేపర్లతో కట్టి అమ్మేసిందట.

రాజశేఖర్నడిగితే 'ఎక్కడో జాగ్రత్తగా దాచిపెట్టా గురూ - పిల్లలు పాడుచేస్తారని. ఇప్పటికిప్పుడు దొరకడం కష్టం ! రెండ్రోజులాగితే ఖచ్చితంగా ఇవ్వగలను ' అన్నాడు. అతని సత్యసంధత ముందే తెలిసిన సారాకి దిక్కుతోచలేదు.

తెలిసినవాళ్ళందరి నుండీ అలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. అప్పుడు గుర్తుకొచ్చాడు ఆపద్బాంధవుడిలా పాపం... అతనివద్ద పుస్తకం చాలా జాగ్రత్తగా ఉంటుంది. కరెక్ట్. ఆ ఆలోచన రాగానే పరుగందుకున్నాడు. వాళ్ళ ఇంటివైపు ఊహించని వేగంతో దూసుకుపోతూ సడన్‌గా కాళ్ళకు బ్రేకులు పడ్డట్టు ఆగిపోయాడు.

శ్రీనివాసనగర్ కాలనీ టర్నింగ్‌లో చెత్తకుండీ... దాన్నిండా మేట వేసినట్టున్న చెత్త ఆ చెత్తకుప్ప మీద ఓ అమ్మాయి ఆ అమ్మాయి ఎల్‌కేజి చదువుతోన్నదనడానికి గుర్తుగా స్కూల్ యూనిఫామ్. ఆ పిల్ల చేతిలో 'నీళ్ళొదులు' పుస్తకం.

జుట్టంతా రేగి, మొహమంతా జిడ్డోడుతూ ఉన్నదా పిల్ల 'ఎక్కడో చూసినట్టుందే ?' అనుకుంటూ తీవ్రంగా ఆలోచించాడు సారా. 'అవును !' ఠపీమని గుర్తొచ్చింది. ఆ పోలికలన్నీ చె.మ.వే. వాని కూతురే నన్నమాట.

మట్టి, దుమ్ము గొట్టుకుపోయిన చేతుల్తో ఆ పుస్తకంలోని పేజిల్ని పిచ్చి పిచ్చిగా తిప్పేస్తున్నది....

సారా గుండెలు గుబగుబలాడాయి... ఆ పిల్ల ఆ పుస్తకాన్నెక్కడ చించేస్తుందోనని. మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ ఆ అమ్మాయి దగ్గరికెళ్ళి ఆ పుస్తకం లాగేసుకోవాలి... ఇంకొక్క అడుగువేస్తే ఆ పని పూర్తయ్యేదే.

సరిగ్గా అప్పుడే టైటిల్ పేజీని సర్రున చించేసింది ఆ అమ్మాయి.

"న్నో!" గట్టిగా అరిచాడు సారా.

"ఛ ! నీ దరిద్రం గూల ! ఇన్నాళ్ళూ నీ కవితల్తోనే చచ్చాను. ఇప్పుడు కలల్తోనూ చంపడం మొదలెట్టావా ?" అంటూ నిర్దాక్షిణ్యంగా మంచమ్మీంచి తోసింది కౌసు.

వాస్తవంలోకొచ్చి బిత్తర చూపులు చూడసాగాడు కె. సామంతరాజు ఉరఫ్ కేయస్సార్ ఉరఫ్ రాజు ఉరఫ్ సారా. ❖